జాగ్రత్తలతోనే జీవాలకు రక్ష

- వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ముప్పు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు



తాడిపత్రి: వర్షాకాలంలో మూగ జీవాలకు ప్రబలే సీజనల్ వ్యాధులపై రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. తరచూ కురుస్తున్న వర్షాలకు పశువులు వివిధ రకాల వ్యాధులు బారినపడే అవకాశాలున్నాయి. ఒక్కోసారి పశువులకు ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇందులో ప్రధానమైనంది చిటుకు వ్యాధి. ఇది తొలకరి వర్షాలు కురిసిన తర్వాత వస్తుంది. పచ్చికతో పాటు గడ్డిని పశువులు, గొర్రెలు, మేకలు తినడంతో వస్తుంది. గడ్డిని తిన్న పశువులు, మేకలు, గొర్రెలు ఇతర జీవాలకు ఈ వ్యాధిని కలుగ చేసే సూక్ష్మజీవులు కడుపులోకి ప్రవేశిస్తాయి.

నివారణ..

చిటుక వ్యాధి నివారణకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. నెల రోజులకు మందు గొర్రెలు, మేకలకు నట్టలు నివారణ మందును తాపించాలి. చెరువులు, కుంటలు, కాలువల్లో జీవాలు మేయడం వల్ల గడ్డిలో ఆకురంగులో ఉన్న జలగలు కడుపులోకి ప్రవేశించి జీర్ణాశయం నుంచి కాలేయానికి చేరుతాయి. వీటివల్ల కామెర్ల వ్యాధి సోకి రక్తహీనత ఏర్పడుతుంది. జీవాలకు ఆకలి మందగించి జబ్బు బారిన పడి మృతి చెందే ప్రమాదం ఉంది. ఏడాదికి రెండు పర్యాయాలు ఇంట్రో ట్యాక్సీనియాను జీవాలకు వేయించడం ద్వారా జీవాల మృతిని నివారించవచ్చు.

ముందస్తు జాగ్రత్తలు ఇవీ..

- వర్షాకాలంలో గొర్రెలు, మేకలను పాకల్లో ఉంచాలి.
- బురద, చిత్తడి నేలల్లో అవి తిరగకుండా చూడాలి.
- రెండు అంగుళాల గడ్డి ఉన్న ప్రదేశాల్లోనే మేపాలి.
- శుభ్రమైన నీరు త్రాగించాలి.
- జీవాలు నివాసం ఉండే ప్రదేశం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- ఎలాంటి వ్యాధి లక్షణాలున్నా సమీపంలో ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదించాలి.
- ముందస్తు జాగ్రత్తగా జీవాలకు యాంటీ టీకాలు వేసుకోవాలి.

తాడిపత్రి నియోజకవర్గంలో ఆవులు, గేదెలు, జీవాల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
తాడిపత్రి	105	969	3,267	1,194
యాడికి	2,638	7,270	1,09,415	17,467
పెద్దవడుగూరు	7,504	5,083	55,590	10,407
పెద్దపప్పూరు	750	4,200	17,450	5,500

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలం ప్రారంభం అయిందంటే పశువులు, జీవాలకు పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఇదే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా చిటుకు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి. గొర్రెలు, మేకలు, ఆవులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించాం. అలాగే పాడి రైతులకు కూడా తరచూ అవగాహన కల్పిస్తున్నాం. సూక్ష్మజీవుల కారణంగా వచ్చే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు (గురక వ్యాధి) ఒకటి. ముఖ్యంగా గేదె జాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన పశువుకు అధిక జ్వరం వస్తుంది.

– ఖదీర్‌బాషా, వెటర్నరీ ఏడీ, తాడిపత్రి

క్లుప్తంగా

స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ల నియామకం



ఎమ్మెల్యే వైవీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కోఆర్డినేటర్లు

గుంతకల్లు రూరల్: స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్‌గా రామకృష్ణ, పామిడి మండల కోఆర్డినేటర్‌గా రవీంద్ర నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆదివారం వారు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వైవీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

అంజుమన్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలి



రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు అంజుమన్ నూతన కమిటీ ఏర్పాటుకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పట్టణంలోని 23 ముస్లిం మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఈద్గా ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీ ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న అంజుమన్ కమిటీ కాలవ్యవధి ముగిసి 3 సంవత్సరాలు దాటినా నూతన కమిటీ ఎన్నికలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించాలని లేనిపక్షంలో ప్రజా సంఘాలు, మసీదు కమిటీలు, మత పెద్దలు, ఖాజీలతో కలిసి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన లక్ష్మీదేవి

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని పత్తి కొండ రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం బైక్‌పై నుంచి పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు.. కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కారుమంచికి చెందిన దంపతులు బైక్‌లో గుత్తికి బయలు దేరారు. అయితే గుత్తి ఆర్‌ఎస్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్ ఎక్కుతున్న సమయంలో బైక్ వెనుక కూర్చున్న లక్ష్మీదేవి జారి కింద పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డాక్టర్ వైవీరెడ్డికి సన్మానం



రామరాజుపల్లిలో డాక్టర్ వైవీరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

పామిడి: రష్యాలోని క్రిమియా మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేసుకుని బెస్ట్ స్టూడెంట్ అవార్డుతో స్వదేశానికి తిరిగి వచ్చిన డాక్టర్ యాపర్ల వన్నూరురెడ్డి(వైవీ రెడ్డి)ని ఆదివారం రామరాజుపల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, జోజోడే కుమార్, హరినాథ్‌రెడ్డి మాట్లాడారు. విదేశాల్లో చదువుకునే పేద విద్యార్థుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. పేద విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ రోహినాథ్, సీఐ రాజశేఖర్‌రెడి పాల్గొన్నారు.

మిరపతోట ధ్వంసం



ధ్వంసమైన మిరపతోట

పెద్దవడుగూరు : అప్పేచర్లలో సాకే దుర్గ వెంకటేష్‌కు చెందిన మిరప తోటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు.. దుర్గ వెంకటేష్ గ్రామ సమీపంలోని తన పొలంలో రెండు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాడు. ఇందుకోసం రూ.2 లక్షల దాకా పెట్టుబడి పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి దాదాపు అర్ధ ఎకరాలోని మిరప చెట్లను పీకేశారు. దీంతో తనకు రూ.50 వేల దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

వాహనాల తనిఖీ

బుక్కరాయసముద్రం: వాహనదారులు వాహనాలను వేగంగా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని అనంతపురం-తాడిపత్రి రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

గార్లదిన్నె: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ప్రజలు సమర్పించే అర్జీలు సంబంధిత అధికారులకు అందజేసి అక్కడికక్కడే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు.

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ సుమతి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయాలన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: స్థానిక సంతమార్కెట్ నుంచి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుంది. కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: బాట సుంకులమ్మ ఆలయ సమీపంలోని కల్యాణ మండపం వద్ద ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. ధర్మాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు బాటు సుంకులమ్మ దేవాలయం కల్యాణ మండపం వద్దకు వచ్చి అక్కడ మోరీలో విషద్రావకం తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్థానికులు గమనించి 108లో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'విదేశీ విద్యాదీవెన' విద్యార్థులకు వరం

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గుంతకల్లు రూరల్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ఓ వరమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. గుత్తి ఆర్.ఎస్‌కు చెందిన జేమ్స్ ప్రశాంత్‌కుమార్ కుమారుడు సనీల్ రాజ అమీన్ అనే విద్యార్థి లండన్ యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ కళాశాలలో నరేటివ్ ఎన్విరాన్‌మెంట్స్‌లో ఎంఎస్ చదివేందుకు ఆర్థిక సహాయ సహకారాలు అందజేయాలని కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విద్యార్థికి ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద రూ.39.32 లక్షలు మంజూరు చేసింది. పామిడికి చెందిన శ్రీనివాసులు కూతురు శ్రీప్రియ యూకేలోని యూకే గ్లాస్కో యూనివర్సిటీలో కార్డియో వాస్కులర్ సైన్స్‌లో ఎంఎస్ చదివేందుకు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద రూ.22 లక్షలు మంజూరు చేసింది. ఈక్రమంలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం మంజూరుకు కృషి చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా తమలాంటి పేదవారికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎంతోమంది పేద విద్యార్థులకు విదేశీ విద్యనందిస్తుంటే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా విదేశీ విద్యాదీవెన అందడం లేదంటూ వక్రీకరించడం బాధాకరమన్నారు. విదేశీ విద్యాదీవెన పథకానికి ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు అప్పటికప్పుడు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసిన ఆర్డీఓ రవీంద్రను ప్రశంశించారు. ఆర్డీఓపాటు పామిడి, గుత్తి మండలాలకు నాయకులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లస్వాములు



పుట్లూరు : కడవకల్లులో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లు

పెద్దపప్పూరు: మొహర్రం భాగంగా తిమ్మనచెరువు, నరసాపురం, చీమలవాగుపల్లి, పెద్దయక్కలూరు, కుమ్మెత, చాగల్లు, ముచ్చుకోట గ్రామాల్లో ఆదివారం పీర్లస్వాములను గ్రామపురవీదుల్లో ఘనంగా ఊరేగించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ ఖాజాహుస్సేన్, జమేదార్లు శివారెడ్డి, అశోక్‌కుమార్ నాయుడు పర్యవేక్షించారు. సోమవారం కొట్లాపల్లి, పెద్దపప్పూరు తదితర గ్రామాల్లో పెద్ద సరిగెత్తు ఉత్సవం జరగనుంది.

గార్లదిన్నె: గార్లదిన్నె, మర్తాడు, యర్రగుంట్ల, బూదేడు, కల్లూరు, ముకుందాపురం, కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం జలధి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో పీర్ల స్వా ములను అగ్నిగుండం ప్రవేశం నిర్వహించి, అనంతరం పీర్లస్వాములను మేలతాళాలు, తప్పెట్లతో గ్రామవీదుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పీర్ల స్వాములకు చక్కెర, బెల్లం చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు జలధి కార్యక్రమంలో భాగంగా పీర్లను ఊరేగింపు నిర్వహించి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. కడవకల్లు, సూరేపల్లి, కుమ్మనమల, గూడూరు, నాయకునిపల్లి తదితర గ్రామాల్లో భక్తులు పెద్ద ఎత్తున స్వామివార్లకు మొక్కులు తీర్చుకున్నారు.

గుత్తి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఆదివారం మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్లను ఎత్తుకుని సవార్లు (ఊరేగింపు) నిర్వహించారు. అగ్ని గుండ ప్రవేశాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పీర్ల మకాన్‌లలో చక్కెరలు చదివించారు. ఎక్కడ చూసినా మొహరం సందడే కనిపించింది. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

యల్లనూరు: తిరుమలాపురంలో పీర్ల పండుగ ఆదివారంతో ముగిసింది. సర్పంచు రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో పీర్ల జలధి జరిగింది. పెద్దెత్తున భక్తులు హాజరై పీర్లకు చెక్కర చదివింపులు చదివించారు.



తిమ్మనచెరువులో జలధికి తరలివెలుతున్న పీర్లు



తిరుమలాపురంలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు



గుత్తి: గొందిపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఒక రోజులోనే ఆరోగ్యశ్రీకార్డు



ఆరోగ్యశ్రీ కార్డులో సరస్వతి

పామిడి: రెండో కాన్పుకోసం వచ్చిన ఓ నిండు గర్భిణికి సుఖ ప్రసవంతో పాటు ఆరోగ్యశ్రీ ఆసరా కింద రూ.5 వేలు వర్తింపజేయడంతో లబ్ధిదారు సంతోషం వ్యక్తం చేసింది. వివరాలు..వంకరాజు కాల్వ గ్రామానికి చెందిన సరస్వతికి స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో శనివారం సుఖ ప్రసవం జరిగింది. అయితే ఆమెకు ఆరోగ్యశ్రీ కార్డు లేని విషయాన్ని ఆరోగ్యమిత్ర బోయ బాబు గుర్తించారు. తక్షణం అతను వంకరాజుకాలువ గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మహబూబ్‌బాషాను ఫోన్‌లో సంప్రదించారు. అతని సహకారంతో సరస్వతి తల్లి బీ వెంకటరమణమ్మ పేరున ఉన్న ఆరోగ్యశ్రీకార్డులో సరస్వతిని చేర్చి ఆరోగ్యశ్రీ ఆసరా వర్తింపజేశాడు. దీంతో సరస్వతి ఆరోగ్యమిత్రతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసింది.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న టీ.శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ, షాల ప్రభుత్వం కారు చౌకగా కార్పొరేట్లకు అప్పగించేందుకు సిద్ధమైన నేపథ్యంలో కార్మికవర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ ఆలిండియా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్ర ఐఎఫ్‌టీయూ వర్క్‌షాప్, రాజకీయ తరగతులకు ఆదివారం టీ.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ రంగంలోని పోస్టల్, టెలికాం, బీఎస్‌ఎన్‌ఎల్, ఇన్సూరెన్స్ తదితర రంగాలకు చెందిన రూ.లక్షల కోట్ల ఆస్తులను ప్రైవేటు కార్పొరేట్లకు మోదీ, షాల ప్రభుత్వం అప్పగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సైతం రద్దు చేసి కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు మార్చారన్నారు. ఈ చట్టాలు కార్మిక వర్గాలకు గుదిబండలుగా మారబోతున్నాయన్నారు. ప్రాధాన్యతా అంశాలను ఎంచుకుని పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



తాడిపత్రి అర్బన్: కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

గుత్తి: మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలకు నిరసనగా గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌తో పాటు మండల వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ఆదివారం క్రైస్తవ సంఘాల సమాఖ్య కన్వీనర్ వైపీ బాబు ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని సీఎస్‌ఐ చర్చి నుంచి మెయిన్ బజారు, పత్తికొండ రోడ్డు, కేంద్రీయ విద్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ మీదగా రాయల్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, సేవ్ మణిపూర్ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ పాస్టర్లు రెవరెండ్ డేవిడ్ నాయక్, అద్భుత కుమార్, సాల్మోన్, బిషప్ వాసు, పాస్టర్లు అబ్రహాం, సాల్మోన్ రాజ్, జాకోబ్,సుధాకర్, వెల్డర్ రవి, హోసన్న రవి, బింగి ప్రతాప్, ప్రవీణ్, హ్యారీ, మత్తయ, రాజేష్, ప్రసాద్, అనిల్, విజయ శేఖర్, గురు మస్తాన్, శామ్యూల్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చెట్నేపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద షారోన్ ప్రార్థన మందిరం పాస్టర్ దేవదానం, చర్చి కమిటీ సభ్యులు సుందర రాజు, డేనియల్, కంబగిరి రాముడు, నరసింహులు, రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం మణిపూర్ ఘటనపై క్రైస్తవ కుటుంబాలు నిరసన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులను రక్షించాలని డిమాండ్ చేశారు.

తాడిపత్రి అర్బన్: మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్టీఏ(అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం) జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐఎస్టీఏ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు వైపీ నాగభూషణం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాంబాబు, శివుడు, వెంకటేశ్వర్లు, సాకే పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మణిపూర్ మారణకాండను నిరసిస్తూ ఆదివారం గుంతకల్లులో యునైటెడ్ క్రిష్టియన్ వెల్‌ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూసీడబ్ల్యూఎఫ్ ప్రసిడెంట్ ఫాదర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో క్రైస్తవులు, వారి ఆస్తులపై , క్రైస్తవ స్కూల్స్, హాస్పిటల్స్‌పై దాడులు జరుగుతున్నాయన్నారు. ఈవిషయం ప్రపంచానికి తెలియకుండా చేయాలని ఇంటర్‌నెట్ సేవలను సైతం నిలిపివేస్తున్నారన్నారు. మీడియాను కట్టడి చేసి రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం కాలరాస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌లో శాంతి స్థాపనకు కృషి చేయాలని కోరారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

తాడిపత్రి అర్బన్: ఏపీ విభజన హామీల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర చేపడుతున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఇటీవల పార్లమెంటులో చేసిన ప్రకటనతో కేంద్రం వైఖరి స్పష్టమైందన్నారు. సీపీఎం నాయకులు ఉమాగౌడ్, నాగరాజు, రామ్మోహన్, రవికుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరి నారు సాగులో మెలకువలు అవసరం

- విత్తనశుద్ధి తప్పనిసరి
- ఆగస్టు మొదటి వారం అనుకూలం
- రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి



బుక్కరాయసముద్రం: ఖరీఫ్ వరి సాగులో రైతులు నారు మడుల సాగులో తప్పనిసరిగా మెలుకువలు పాటించాల్సిన అవసరం ఉందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సాక్షికి వరి నారు సాగులో మెలవకువలను వివరించారు. జిల్లాలో రైతులు ఖరీఫ్ సాగులో బోరు బావుల కింద వరి సాగుకు సిద్ధమవుతున్నారన్నారు. జిల్లాలో వేరుశనగ తర్వాత వరి సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారని తెలిపారు. రైతులు మొదటిగా నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలని తెలియజేశారు.

విత్తనశుద్ధి చేయాల్సిందే...

రైతులు ముందుగా వరి విత్తనాన్ని శుద్ధి చేసుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండైజిం కలిపి 24 గంటల తర్వాత నారు మడిలో చల్లుకోవాలి. దంప నారు మల్లక అయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండైమ్ కలిపి ఆ ద్రావణంలో వరి విత్తనాలను 24 గంటలు నానబెట్టి వరి మొలక వచ్చిన తర్వాత నారు మడిలో చల్లుకోవాలి. ఎకరాకు 20 నుంచి 25 కిలోలు వరి విత్తనం వేసుకోవాలి. గరుగు భూముల్లో 30 కిలోలు వేసుకోవాలి. ఖరీఫ్ సీజన్‌లో జూలై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారంలో వరి నారును పెంచుకోవావడానికి అనుకూలం.



గోవిందపల్లిలో సాగు చేసిన నారు మడి

నారుమడుల పెంపకానికి సూచనలు

వరి మొలక చల్లుకునే ముందు నార మడులను బాగా దుక్కి చేసుకోవాలి. మడిలో నీరు పెట్టడానికి తీయడానికి వీలు ఉండేలా చూసుకోవాలి. 5 సెంట్లు నారుమడికి 2 కిలోల నత్రజని ఒక కిలో భాస్వరం, ఒక కలో పొటాష్ ఎరువులను నార మొలక ముందు దుక్కిలో వేసుకోవాలి. వరి మొలక సెంటుకు 5 కిలోల వరి విత్తనం చల్లుకోవాలి. మడిలో నారు ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు పలుచుగా నీటి తడులు ఇస్తూ తొలగిస్తూ ఉండాలి. నారు మడులలో జింక్ లోపం ఉన్నట్లయితే లీటరు నీటికి 2 గ్రాములు జింక్ సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారు విత్తనం వేసిన 10 రోజులకు కార్బోఫ్యూరాజిన్ 3జి లేదా 4జి గులికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున వేసుకోవాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లేదా క్లోరోపైరిఫాస్ 2.0 మిల్లీ లీటరు నీటికి కలిపి 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలి. మడిలో నారు తీయుటకు 7 రోజుల ముందు కార్బోఫ్యూరాజిన్ గుళికలు వేసుకోవాలి. బీపీటీ వరి నారు అయితే 2 నెలల తర్వాత, 1010 వరి రకం అయితే 30 రోజులకు నాటుకోవాలి.